www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 30 అక్టోబర్ 2024 5 ఏలూరు



1న పింఛన్ల పంపిణీ
డిఆర్‌డిఎ పీడీ విజయరాజు

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ సొమ్ము పంపిణీ నవంబర్ ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకు ప్రారంభమవుతుందని డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు తెలిపారు. ఏదైనా కారణాలతో ఒకటో తేదీన పింఛన్ సొమ్ము అందుకోని వారు రెండో తేదీన పొందొచ్చని పేర్కొన్నారు. జిల్లాలో నవంబర్‌లో 2,63,768 మంది పింఛన్‌దారులకు రూ.112.74 కోట్లు పంపిణీ చేయాల్సి ఉందని, ఒకటో తేదీన నూరుశాతం పంపిణీకి చర్యలు తీసుకున్నామని తెలిపారు. పింఛన్ పంపిణీ విధుల్లో 5,232 మంది సిబ్బంది ఉంటారని, ఈ పంపిణీని ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారని పేర్కొన్నారు. సిబ్బంది మొదటి రోజే పూర్తిస్థాయిలో పంపిణీకి కృషి చేయాలని కోరారు.

పేలుతున్న టపాసుల ధరలు

ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన దీపావళి టపాసుల దుకాణాలు

ధరల నియంత్రణపై కొరవడిన పర్యవేక్షణ
దుకాణాల వద్ద కానరాని ధరల పట్టిక
ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి అమ్మకాలు
రెండు జిల్లాల్లో 500కుపైగా బాణసంచా దుకాణాలకు లైసెన్స్‌లు
జాగ్రత్తలతోనే సరి.. ధరలపై పట్టించుకోరా అంటూ జనం ఆగ్రహం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో పండగ పూట అర్ధాకలితో గడపాల్సిన పరిస్థితి ఒకపక్క, మరోపక్క దీపావళి టపాసుల ధరలు పేలుతుండటం సామాన్య ప్రజానీకాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. భారీగా పెరిగిన టపాసుల ధరలతో సామాన్యులు దీపావళి పండగంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. కుటుంబం అంతా కలిసి జరుపుకోవాల్సిన దీపావళిని డబ్బు ఉన్నవారికే పండుగ అన్నట్లు మారింది. గురువారం దీపావళి పండుగ నేపథ్యంలో రెండు జిల్లాల్లోనూ పెద్దఎత్తున మందుగుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో మంగళవారం మధ్యాహ్నానికి 302 దుకాణాలకు తాత్కాలిక లైసెన్స్‌లు మంజూరు చేశారు. లైసెన్స్‌ల జారీ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఏలూరు జిల్లాలో 200 దుకాణాలకు లైసెన్స్‌లు జారీ చేయగా ఇంకా జారీ ప్రక్రియ కొనసాగుతోంది. బుధవారం మధ్యాహ్నానికి దుకాణాల సంఖ్యపై పూర్తిస్థాయి స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మందుగుండు సామగ్రి దుకాణాల లైసెన్స్‌ల వ్యవహారం ఫైర్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సాగుతోంది. పోలీస్‌శాఖ పర్యవేక్షణ సైతం ఉంటుంది. జిల్లా కేంద్రం ఏలూరులోని ఇండోర్ స్టేడియంలో 47 మందుగుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేయగా, పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరం లూథరన్ గ్రౌండ్‌లో 39 దుకాణాలను ఏర్పాటు చేశారు. ఇక మండలాలు, గ్రామాల పరిధిలో పెద్దఎత్తున మందుగుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఈ దుకాణాల వద్ద ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపైనే అధికారులు మాట్లాడుతున్నారు. మందుగుండు సామగ్రి ధరల నియంత్రణపై ఏఒక్క అధికారీ నోరు మెదపడం లేదు. మందుగుండు సామగ్రి దుకాణాల వద్ద ధరలకు సంబంధించిన పట్టికలు లేకుండా పోయాయి. బస్టాండ్లు, రైతుబజార్లలో సైతం అక్కడ విక్రయించే వస్తువుల ధరల పట్టిక ప్రదర్శిస్తారు. గ్రామ సచివాలయాల వద్ద సైతం ఏ సేవకు ఎంత రుసుము వసూలు చేయాలో సైతం వివరిస్తున్నారు. దీపావళి మందుగుండు సామగ్రి ధరలపై మాత్రం కనీస పర్యవేక్షణ లేకుండా పోయింది. దుకాణం ఏర్పాటు చేసిన వ్యక్తి తనకు నచ్చిన ధర నిర్ణయించి విక్రయించేస్తున్న పరిస్థితి ఉంది. దీపావళికి మందుగుండు సామగ్రి అమ్మకాలు రూ.కోట్లలో జరుగుతుంటాయి. ఈ పరిస్థితుల్లో ధరల నిర్ణయంపై స్పష్టత లేకపోవడం ఏమిటనే ప్రశ్న జనాలను తొలిచేస్తోంది.

ధరలతో జనం బెంబేలు

దీపావళి మందుగుండు సామగ్రి ధరలు చూసి సామాన్యులు వణికిపోతున్నారు. గతంలో రూ.500 తీసుకెళ్తే ఇంటిల్లపాది కాల్చుకునేంతా దీపావళి సామన్లు వచ్చేవి. ఇప్పుడు ఆ డబ్బులకు ఒకటి, రెండు వస్తువులు కూడా రాని పరిస్థితి ఉంది. టపాసుల ధరలు గతంతో పోల్చితే భారీగా పెంచేసి అమ్ముతున్నారు. నలుగురు సభ్యులున్న కుటుంబం కనీసం రూ.ఐదు వేలు ఖర్చుచేస్తే తప్ప కొద్ది మందుగుండు సామగ్రి వచ్చే పరిస్థితులు లేవు. దీంతో సామాన్య ప్రజానీకం దీపావళి పండుగ జరుపుకోలేని పరిస్థితి నెలకొంది. అధికారులు మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా హడావుడి చేస్తున్నారనే విమర్శలున్నాయి. జిఎస్‌టి అధికారులు చూసుకుంటారని చెబుతున్నారు. విక్రయించే ప్రతి వస్తువుకూ జిఎస్‌టి ఉంటుంది. ధరల పట్టిక లేకుండా ఏవిధంగా విక్రయాలు సాగిస్తారో అర్థం కావడం లేదు. సంబంధిత శాఖల అధికారులకు పెద్దఎత్తున మామూళ్లు ఇస్తున్నామని, ధరలు తగ్గించి విక్రయిస్తే తమకు ఏమాత్రం గిట్టుబాటు కాదన్నట్లు దుకాణ యజమానులు చెబుతుండటం విశేషం.

ఫైర్ అధికారుల స్పందన కరువు

దీపావళి మందుగుండు సామగ్రి దుకాణాల ఏర్పాటులో ఫైర్ అధికారులది కీలకపాత్ర. ఆ శాఖ అధికారులు ఇన్‌స్పెక్షన్ చేసి ఇచ్చే నివేదిక ఆధారంగానే రెవెన్యూ అధికారులు దుకాణాలకు లైసెన్స్‌లు మంజూరు చేస్తారు. అయితే ఈ దుకాణాల ఏర్పాటుకు సంబంధించి ఎటువంటి వివరాలను ఫైర్ అధికారులు చెప్పడం లేదు. దీనిపై మీడియా ముఖంగానూ అధికారులు స్పందించకపోవడం, ఫోన్లకు స్పందించకపోవడం గమనార్హం. మందుగుండు సామగ్రి దుకాణాల ఏర్పాటులో ఏమైనా ఇబ్బందులుంటే సరిచేయాల్సిన అధికారులే స్పందించకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఏలూరు ఫైర్ ఆఫీసులో దుకాణాల ఏర్పాటుకు సంబంధించి కనీస సమాచారం ఇవ్వకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఇప్పటికైనా ఫైర్ అధికారులు మందుగుండు సామగ్రి దుకాణాలకు సంబంధించిన సమాచారం, ధరలకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలిపే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మచ్చుకు కొన్నింటి ధరలు..

పేరు	ధర
కాకర పువ్వొత్తుల బాక్స్	రూ.100
చిచ్చుబుడ్డులు చిన్నవి బాక్స్	రూ.160
భూచక్రాలు బాక్స్	రూ.150
60 షాట్స్ బాక్స్	రూ.900
పాముబిళ్లల బాక్స్	రూ.50
లక్ష్మీబాంబ్ కట్ట	రూ.150
నారబాంబు బాక్స్	రూ.150
విష్ణు చక్రాలు బాక్స్	రూ.150

బాణసంచా కాల్చుతున్నారా.. జర జాగ్రత్త

ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పిల్లల నుండి పెద్దల వరకు ఆనందంగా జరుపుకునే దీపావళి పండగ సందర్భంగా బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ సూచించారు. జిల్లాలో ఎవరైనా అనధికారికంగా బాణాసంచా ఇళ్ల మధ్య నిల్వ చేసినట్లు సమాచారం 112కు లేదా 9550351100కు వాట్సాప్ ద్వారా తెలియజేస్తే అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. దీపావళి సందర్భంగా ప్రజలు, బాణసంచా విక్రయదారులు కచ్చితంగా ఈ కింది సూచనలు పాటించాలని కోరారు.

ప్రజలకు సూచనలు

☞ దీపావళి రోజున బాణసంచా కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు మాత్రమే ధరించవలెను. ఐఎస్ఐ మార్కు గల ప్రసిద్ధిగాంచిన కంపెనీల బాణసంచా మాత్రమే కొనాలి.
☞ పెద్దల సమక్షంలో మాత్రమే పిల్లలు బాణసంచా కాల్చాలి.
☞ ఇళ్ల వద్ద బాణసంచా కాల్చేటప్పుడు ఒక డ్రమ్ము నీరు దగ్గర ఉంచండి.
☞ బాణసంచా కాల్చి రోడ్లపై నడిచే ప్రజలపై, వాహనాలపై వేయరాదు.
☞ బాణసంచాను ఒకసారి అంటించిన తర్వాత కాల లేదని వాటి వద్దకు వెళ్లి నోటితో ఊదడం, మళ్లీ అంటించే ప్రయత్నం చేయొద్దు.
☞ రాత్రి 10 గంటల తర్వాత బాణసంచా కాల్చరాదు.
☞ బాణసంచా పేలి గాయమైన శరీర భాగంపై వెంటనే చల్లని నీరు ధారగా పోయండి. లేదా నీటిలో కాలిన భాగం ముంచి ప్రథమ చికిత్స అనంతరం వెంటనే వైద్యులను సంప్రదించాలి.
☞ ఇంటి లోపల బాణసంచా కాల్చరాదు.
☞ పేలుడు బాంబులను, చిచ్చుబుడ్లను చేతితో పట్టుకొని కాల్చొద్దు.
☞ బాణసంచా కాల్చిన తరువాత వాటిపై నీరు పోయాలి.
☞ కాలని బాణసంచాను నీటిలో పూర్తిగా ముంచాలి.

విక్రేతలకు హెచ్చరికలు

☛ బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసేవారు ఆర్‌డిఒ నుంచి అనుమతి పొంది నిర్దేశిత ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలి.
☛ దుకాణం, దుకాణానికి మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలి.
☛ ప్రతి షాపు వద్ద 200 లీటర్ల కెపాసిటీ గల రెండు డ్రమ్ములు ఏర్పాటు చేసుకుని అందులో నీరు, ఇసుక నింపి సిద్ధంగా ఉంచాలి.
☛ ప్రభుత్వ అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
☛ అనుమతులు లేకుండా ఫైర్ క్రాకర్స్ ముందుగా కొనుగోలు చేసి ఒకచోట డంప్ చేయడం చట్టరీత్యా నేరం, అలాంటి వారిపై కేసు నమోదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకుంటాం.

పర్యావరణ హిత దీపావళి మేలు

జిల్లా ప్రజలకు ఎస్‌పి సూచన
ఏలూరు ఇండోర్ స్టేడియంలో బాణసంచా దుకాణాల వద్ద తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సాధారణ పౌరులకు, పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రజలందరూ దీపావళి పండుగ జరుపుకోవాలని జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివ కిషోర్ కోరారు. మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను ఆయన సందర్శించి ఏర్పాట్లను తనిఖీ చేశారు. దుకాణదారులు పొందిన అనుమతి పత్రాలను పరిశీలించారు. దుకాణాల వద్ద అగ్నిమాపక నిరోధక సామగ్రిని పరిశీలించి ఎక్కువ ఇసుక, నీరు, ఫైర్ సేఫ్టీ సాధనాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి షాపు వద్ద వైఫై సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎటువంటి ప్లాస్టిక్ వస్తువులను అనుమతించరాదని, కరెంటు వైర్ల విషయంలో పలు జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. గ్రీన్ బాణసంచాను ఉపయోగించాలని కోరారు. దుకాణాల వద్ద పోలీస్ గస్తీ కొనసాగిస్తామన్నారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు త్రీటౌన్ సిఐ కోటేశ్వరరావు, ట్రాఫిక్ సిఐ లక్ష్మణ్‌బాబు తదితరులు ఉన్నారు.

రక్షణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి

25 మంది బ్యాంక్ ఉద్యోగుల రక్తదానం

రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విజిలెన్స్ అవగాహనా వారోత్సవాల్లో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సత్రంపాడులోని చైతన్య గోదావరి గ్రామీణ రీజినల్ బ్యాంక్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 25 మంది బ్యాంక్ ఉద్యోగులు రక్తదానం చేశారని రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన ఉద్యోగులకు కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ యు.శ్రీదేవి మాట్లాడుతూ భారతదేశం అవినీతిరహిత దేశంగా ఏర్పడాలనే ఉద్దేశంతో, ఉద్యోగుల పనితీరును ప్రోత్సహించే విధంగా విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ రీజనల్ బ్యాంకు హెచ్‌ఒడి బి.కిషన్, డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కె.వరప్రసాదరావు, పిఆర్ఒకెవి.రమణ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న బ్యాంక్ ఉద్యోగి

నిర్వాసితుల ఇంటి విలువ జాబితాలో చేర్చాలి

సిపిఐ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలేరుపాడు మండలం తాటికూరు గొమ్ము పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు 140 మందినిః ఇంటి స్ట్రక్చర్ వ్యాల్యూ లిస్టులో చేర్చాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఆ గ్రామస్తులు మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగ ప్రభాకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఏలేరుపాడు మండలం తాటికూరు గొమ్ము పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన పోలవరం నిర్వాసితులు 335 మందికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి అవార్డు ఇచ్చి ఉన్నారని, అవార్డు ఇచ్చిన 335 కుటుంబాలలో 140 కుటుంబాలను అధికారులు నిర్లక్ష్యంగా ఇంటి స్ట్రక్చర్ వ్యాల్యూ లిస్టులో నుంచి తొలగించారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారులు తక్షణమే జగన్నాథపురం గ్రామం పర్యటించి పోలవరం నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పరిశీలించి, అందులో అవార్డు పొంది, ఇంటి స్ట్రక్చర్ వాల్యూలో లేని 140 కుటుంబాల వారిని చేర్చాలని డిమాండ్ చేశారు. తొలగించిన 140 కుటుంబాల వారిని ఇంటి స్ట్రక్చర్ వాల్యూ లిస్టులో చేర్చకపోతే లబ్ధిదారులతో కలిసి సిపిఐ పోరాడుతుందని వారు హెచ్చరించారు. సిపిఐ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు ఏలేరుపాడు, కుక్కునూరు మండలాలతో పాటు మిగిలిన మండలాల రైతులు, గిరిజనులు, ప్రజలు అనేక త్యాగాలు చేసి, అనేక నష్టాలు భరించి ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరిస్తున్నారని ప్రభుత్వం ఓ పక్కన పేర్కొంటూ, మరో పక్క నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి త్యాగాలు చేసిన నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు అన్ని సంక్షేమ పథకాలు అందేలాగా, ముఖ్యంగా తాటికూరు గొమ్ము పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన 140 కుటుంబాల వారిని ఇంటి స్ట్రక్చర్ వ్యాల్యూ లిస్టులో చేర్చి న్యాయం చేయాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పులూరి హేమ శంకర్ పాల్గొన్నారు.

ధర్నా కార్యక్రమంలో సిపిఐ నాయకులు

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటర్ల చేర్పింపులో..

అధికారుల తీరు అభ్యంతరకరం

కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓట్ల చేర్పింపులో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ కలెక్టర్‌ను కోరింది. ఈ మేరకు జిల్లా బృందం మంగళవారం డిఆర్‌ఒకు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ,రవి మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల చేర్పింపు సందర్భంగా జిల్లాలోని కొందరు అధికారులు అధికార పార్టీ నేతలతో కలిసి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ముదినేపల్లి ఎంఇఒ కైకలూరు ఎంఎల్ఎ ఆధ్వర్యంలో మీటింగ్ జరుగుతుందని, ఉపాధ్యాయులంతా సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు పట్టుకుని ఈ నెల 28న సమావేశానికి రావాలని వాట్సాప్‌లో వాయిస్ మెసేజ్ పంపారని తెలిపారు. చింతలపూడిలో టిడిపి ఆధ్వర్యాన నిర్వహించిన ఓటర్ల నమోదు సదస్సులో ఎంఎల్ఎ, టిడిపి నేతలతోపాటు తహశీల్దార్, ఎంపిడిఒలు పాల్గొన్నారని వివరించారు. ప్రభుత్వ అధికారులు ఈ విధంగా అధికార పార్టీ సదస్సుల్లో పాల్గొనడం సరికాదన్నారు. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ పాల్గొన్నారు.


వినతి అందిస్తున్న నేతలు

ఆర్‌అండ్‌ఆర్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి: జెసి

ప్రజాశక్తి - ఏలూరు

పోలవరం ప్రాజెక్టు ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత నిర్మాణ ఏజెన్సీలను జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, ఇతర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి పెండింగ్ గ్రీవెన్స్‌లను త్వరగా పరిష్కరించాలని తహశీల్దార్లను ఆదేశించారు. కొవ్వూరు, ఏలూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ త్వరితగతిన భూ నష్టపరిహారం బిల్లులను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ముక్కంటి, ఆర్‌వి.రమణ నాయక్, ఐటిడిఎ ఎపిఒ పివిఎస్.నాయుడు, గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్, హౌసింగ్ తదితర శాఖల ఎఇలు, డిఇలు, బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

ధాన్యం మద్దతు ధర కోసం ఉద్యమం

క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించాలి
కొనుగోలు సమస్యలు పరిష్కరించాలి
ధాన్యం రైతుల జిల్లాస్థాయి సదస్సు డిమాండ్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రభుత్వం చెప్పే దానికి, ఆచరణకు పొంతన ఉండడం లేదని, పెట్టుబడి ఖర్చులకు తగిన విధంగా మద్దతు ధర పెంచడం లేదని, ఒక్క పైసా కూడా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వడం లేదని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు. మంగళవారం కైకరంలోని తూర్పువీధి రామాలయం ఎల్ఐసి కళ్యాణ వేదిక వద్ద ఎపి రైతుసంఘం, ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ధాన్యం మద్దతు ధర-కొనుగోలు సమస్యలపై జిల్లాస్థాయి రైతు సదస్సు నిర్వహించారు. సదస్సుకు కౌలురైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు అధ్యక్షత వహించారు. ధాన్యం మద్దతు ధర, కొనుగోలు సమస్యలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ధాన్యం మద్దతు ధర కోసం ఉద్యమించాలని జిల్లా సదస్సు పిలుపునిచ్చింది. ముఖ్య అతిథి శ్రీనివాస్ మాట్లాడుతూ సార్వాలో ఒక ఎకరా వరిసాగుకు రూ.38,700 వరకు ఖర్చవుతుందని, దాళ్వాలో మరో రూ.10 వేలు అదనంగా ఖర్చవుతుందని తెలిపారు. రెండు పంటలకు కలిపి రూ.87,400 వరకు ఖర్చవుతుందన్నారు. ఎకరాకు రెండు పంటలకు కౌలు 25 నుండి 30 బస్తాల వరకు ఉందన్నారు. వరికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా కేరళలో సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం క్వింటా ధాన్యానికి రూ.900 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తోందని తెలిపారు. మన రాష్ట్ర ప్రభుత్వం ఒక పైసా కూడా బోనస్ ప్రకటించలేదన్నారు. ధాన్యానికి క్వింటాల్ కు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తేనే రైతు గట్టెక్కే పరిస్థితి ఉంటుందని చెప్పారు. ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించి రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సదస్సులో ఆయా సంఘాల నేతలు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కోనా శ్రీనివాసరావు, సున్నా వెంకట్రావు, దూడే కేశవ, వానపల్లి సత్యనారాయణ, చిత్తా వెంకటేశ్వరరావు మాట్లాడారు.

విద్యుత్ అధికారుల దాడులు నిరసించాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

దళితుల ఇళ్లపై విద్యుత్ అధికారులు చేస్తున్న దాడులు హేయమైన చర్య అని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్ అన్నారు. మండలంలోని రెడ్డి గణపవరంలో విద్యుత్ శాఖ అధికారుల పనితీరుపై అక్కడి దళితులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ విద్యుత్ సబ్సిడీ రాయితీలు ఉన్నా విద్యుత్ ఛార్జీలు చెల్లించాలని గణపవరం దళిత పేటలోకి విద్యుత్ అధికారులు చొరబడి, దళితులను ఇబ్బందులకు గురిచేస్తూ విద్యుత్ మీటర్లు పట్టుకెళ్లిపోవడం ఏమిటని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వాలు జిఒ నెంబర్ 91ను విడుదల చేసి డాక్టర్ జగజ్జీవన్ రామ్ జ్యోతి పథకం ప్రవేశపెట్టాయని గుర్తుచేశారు. దీని ద్వారా ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్ల విద్యుత్ సబ్సిడీ కల్పించినప్పటికీ విద్యుత్ అధికారులు దౌర్జన్యం చేస్తూ బిల్లులు కట్టాలని దళితులను వేధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెండింగ్ బకాయిలను సాకుగా చూపుతూ దళిత మహిళలు బతిమిలాడుతున్నా వినకుండా దౌర్జన్యం చేస్తూ, కరెంటు మీటర్లు తొలగిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సబ్సిడీపైన అధికారులు వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో దళిత, గిరిజన సంఘాలను ఐక్యం చేసి ఉద్యమిస్తామని ఆయన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్‌సి గ్రామ పెద్దలు కె.గంగరాజు, సత్యనారాయణ, దుర్గారావు, ఎన్.శ్రీను, పాపమ్మ, ఎ.రాజశేఖర్, కె.వెంకటేశ్వరరావు, తాళ్లూరు వెంకటేశ్వరావు, టి.వెంకటేశ్వరమ్మ, బాధితులు కె.విమల ఉన్నారు.

గ్రామస్తులతో నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్

గురుకుల పాఠశాలలో సైన్స్ ఫెయిర్

పాల్గొన్న ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు

ప్రాజెక్టు ప్రదర్శనలో విద్యార్థులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అట్టహాసంగా జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్ సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు హాజరై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్స్‌ను పరిశీలించారు. విద్యార్థులు తమలోని ప్రతిభను చాటేలా ప్రాజెక్టులు రూపొందించారు. విద్యార్థులకు పాఠశాల దశ నుంచే సృజనాత్మకతపై పదును పెట్టడానికి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. బాల్యదశ నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ఎంఎల్ఎ అన్నారు.

జోనల్ స్థాయిలో జరిగే సైన్స్ ఫేర్‌కు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణ, ఎన్‌టిఆర్ జిల్లాల నుంచి 31 గురుకులాలకు చెందిన 108 మంది విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌కు వారి ప్రాజెక్ట్స్‌తో హాజరయ్యారు. జూనియర్స్ విభాగంలో 21, సీనియర్ విభాగంలో 31 ప్రాజెక్ట్స్ ప్రదర్శించారు. సోషల్, సైన్స్, మేథ్స్, సోలార్ ఎనర్జీ, క్రాఫ్ట్‌వర్క్ మొదలగు విభాగాలలో విద్యార్థులు ప్రాజెక్ట్స్ రూపొందించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బెజవాడ రాణి మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి ఆవిష్కరణల వల్ల వారిలోని సృజనాత్మక మెరుగుపడుతుందని అన్నారు. ద్వారకాతిరుమల గురుకుల పాఠశాలలో సైన్స్ ఫెయిర్‌కు హాజరయ్యే విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

సర్వజనాసుపత్రికి 125 పడకలు అందజేత

యాక్ట్ సంస్థ సేవలు అభినందనీయం
ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తమ వినియోగదారులకు మెరుగైన సేవలందించడంతో పాటూ సమాజ సేవా కాంక్షను ఒక్క తాటిపైకి తెచ్చి యాక్ట్ సంస్థ ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి ప్రశంసించారు. ఏలూరులోని జిల్లా సర్వజనాసుపత్రికి రోగుల సౌకర్యార్థం పడకలు అందించే విషయాన్ని ఎంఎల్‌ఎ బడేటి చంటి యాక్ట్ సంస్థ యాజమాన్యం దృష్టికి తీసుకురాగా తక్షణం స్పందించిన యాక్ట్ డిజిటల్ హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రయివేట్ లిమిటెడ్ దాదాపు 125 పడకలను అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసి వాటిని అందజేసింది. ఈ పడకలను ఏలూరు సర్వజనాసుపత్రిలో మంగళవారం ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబుతో కలిసి ఎంఎల్‌ఎ బడేటి చంటి ప్రారంభించి, ఆసుపత్రి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ జిల్లా సర్వజనాసుపత్రిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నదే తన ఆకాంక్ష అని వెల్లడించారు. తాను అడిగిన వెంటనే తక్షణం స్పందించి సుమారు రూ.15 లక్షల విలువైన 25 ఎమర్జెన్సీ పడకలను, 100 సాధారణ పడకలను రోగుల సౌకర్యార్థం అందించడం అభినందనీయమన్నారు. ఇప్పటికే

పడకలు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ, మేయర్

ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టామని అన్నారు. రోగుల బంధువులకు ఉపయుక్తంగా ఉండేలా వెయిటింగ్ రూమ్‌ను నిర్మించేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో 24 గంటలూ డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు ఎంఎల్‌ఎ చంటి స్పష్టం చేశారు. మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సర్వజనాసుపత్రి అభివృద్ధికి ఎంఎల్‌ఎ బడేటి చంటి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. అదేవిధంగా పడకల కొరతపై ప్రత్యేక దృష్టిసారించిన ఆయన యాక్ట్‌తో సంప్రదించి, ఆ దిశగా వాటి కొరత తీర్చేందుకు చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. ఇందుకు స్పందించి పెద్ద మనసు చాటుకున్న యాక్ట్ సంస్థ యాజమాన్యాన్ని మేయర్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు యాక్ట్ నిర్వహించాలని ఆకాంక్షించారు. యాక్ట్ ఆపరేషన్స్ హెడ్ బివి.సుబ్బారావు మాట్లాడుతూ తమ వినియోగదారులకు మెరుగైన సేవలందించడంతో పాటూ, సమాజ సేవలో కూడా యాక్ట్ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు, తమ సంపూర్ణ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తొలుత ముఖ్య అతిథులకు యాక్ట్ యాజమాన్య ప్రతినిధులు ఘన స్వాగతం పలకగా, చివరిగా యాక్ట్ ప్రతినిధులను ముఖ్య అతిథులు ఘనంగా సన్మానించారు. కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్‌ఎంఆర్ పెదబాబు, నాయకులు పూజారి నిరంజన్, బెల్లంకొండ కిషోర్, త్రిపర్ణ రాజేష్, ప్రభుత్వాసుపత్రి ఆర్‌ఎంఒ డాక్టర్ సిహెచ్.దుర్గాకుమార్, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లిఖార్జునరావు, జనరల్ మేనేజర్ టి.సీతారామారావు పాల్గొన్నారు.

'కుక్కునూరుకు ఆర్‌టిసి బస్సు'

ప్రజాశక్తి - కుక్కునూరు

ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం కుక్కునూరు నుంచి జంగారెడ్డిగూడెం వరకూ ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకు బస్సు లేకపోవడం వల్ల మండల ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ స్పందించి వెంటనే కుక్కునూరు మండలానికి ఆర్‌టిసి బస్సు ఏర్పాటు చేశారు. ఆ బస్సు రాత్రి 8 గంటలకు జంగారెడ్డిగూడెంలో బయలుదేరి కుక్కునూరు 10 గంటలకు చేరుకుంటుంది. రాత్రి కుక్కునూరులో ఉండి ఉదయం 5 గంటలకు కుక్కునూరు నుంచి వయా జంగారెడ్డిగూడెం టు రాజమండ్రి వరకూ ఆ బస్సు వెళుతుంది. బస్సు సౌకర్యాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి డిపో అసిస్టెంట్ మేనేజర్ తెలియజేశారు. బస్సు ఏర్పాటు చేసినందుకు జిల్లా కలెక్టర్‌కు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఎల్‌సి ఎన్నికల్లో సమర్థున్ని గెలిపించండి

టిడిపి మండల అధ్యక్షులు మాటూరి వెంకట రామయ్య

ప్రజాశక్తి - చింతలపూడి

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో సమర్థునికి పట్టం కడదామని టిడిపి మండల అధ్యక్షులు మాటూరి వెంకట రామయ్య అన్నారు. చింతలపూడి పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద, పలు కేంద్రం వద్ద గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట రామయ్య మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు తాటి అప్పారావు, తాటి సింహం, ఇసుక శ్రీను పాల్గొన్నారు.

కార్యకర్తలకు అన్నివిధాలా అండగా ఉంటా

ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కార్యకర్తలకు అన్నివిధాలా భరోసా కల్పించి, అండగా ఉండడమే తన ధ్యేయమని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తొలిసారి ఏలూరు విచ్చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏలూరు మల్కాపురంలోని ఆశ్రం ఆసుపత్రి కూడలిలో ఫ్లెక్సీలు కడుతూ విద్యుత్ షాక్‌తో గాయాలపాలై, స్థానిక చైత్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుమ్మరి రేవుకు చెందిన తోట గంగధర్‌రావు అనే కార్యకర్తను ఎంఎల్‌ఎ చంటి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుని కుటుంబ సభ్యులతో స్వయంగా మాట్లాడి, వారికి భరోసా కల్పిస్తూ రూ.50 వేల సొంత నిధులను తక్షణ సాయంగా అందించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అంతేకాకుండా గాయపడ్డ గంగధర్‌రావుకు ఉచితంగా వైద్యం అందించాలని చైత్రా ఆసుపత్రి వైద్యులకు ఆయన సూచించారు. గంగాధర్‌రావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కూడా సాయం అందించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

మిర్చి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఉద్యానవన అధికారి కె.జ్యోతి

ప్రజాశక్తి - ముసునూరు

మిర్చి రైతులు ఎండు తెగులు, వేరుకుళ్ల తెగులు, బ్యాక్టీరియా తెగులు ఆశించకుండా ముందుగా తగు జాగ్రతలు తీసుకోవాలని ఉద్యానవన అధికారిణి కె.జ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని వలసపల్లి, గుళ్లపూడి, గుడిపాడు గ్రామాల్లో మిర్చి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ కచ్చితంగా సర్టిఫైడ్ నర్సరీల నుంచే మొక్కలను తీసుకునేటప్పుడు రసీదును కూడా తెచ్చుకోవాలని, భూములు పంట మార్పిడి చేపట్టాలని, పచ్చిరొట్ట ఎరువులను పూత దశలో జూన్ మాసాలలో వేసుకొని కలియదున్నాలన్నారు. నారు దశలో ఉన్నప్పుడు లీటర్ నీటిలో ఇమిడి 0.3 ఎంఎల్ చొప్పున వేసి శుద్ధి చేయాలని, ఆశించిన తెగులు నివారణకు పూత సమయాల్లో కచ్చితంగా సూక్ష్మ పోషకాలు, ఎరువులు పిచికారి చేయాలన్నారు. రసం పీల్చే పురుగుల నివారణకు ముందస్తుగా జిగురు అట్టలను ఎకరానికి పది చొప్పున అమర్చాలని రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి చలసాని దామోదరరావు, టిడిపి నాయకులు మెదరమెట్ల సురేంద్ర, పలువురు రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి పెట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

నేవీ ఆయుధ డిపోను వ్యతిరేకించి గ్రామల్లో పేరుకుపోయిన సమస్యలపై దృష్టి పెట్టాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గ్రామ శాఖ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న నేవీ ఆయుధ డిపోని వ్యతిరేకించి గ్రామల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి ఆదేశించారు. మండలానికి రూ.6 కోట్ల నిధులు కేటాయిస్తే నాయకుల ఇళ్ల ముందు రోడ్లకు శంకుస్థాపనలు చేస్తున్నారని విమర్శించారు. పలు గ్రామాల్లో సరైన రోడ్లు, డ్రెయినేజీలు లేవని వాటిని వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ కార్యదర్శులుగా డి.వెంకటలక్ష్మి, ఎస్.అప్పారావులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, కొండలరావు, వెంకటలక్ష్మి, నిర్మల, కన్నమ్మ పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని పోలవరం నియోజకవర్గ ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, జనసేన, బిజెపి, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) ప్రజాతంత్ర నాయకులు మంగళవారం పోలవరం ఆర్ అండ్ ఆర్ కమిషనర్ రామ్ సుందర్ రెడ్డిని మంగళవారం కలిసి వినతిని సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం ఉన్న సొంత ఇంటిని, పాడి పంటలను, సేద్యం చేసే భూమిని, ఉండే ఊరిని ఇలా సర్వస్యం త్యాగం చేస్తే ఈరోజు సర్వేల పేరుతో న్యాయపరంగా రావలసిన ప్యాకేజీలు రాకుండా పేర్లు తొలగిస్తున్నారన్నారు. తాట్కూరుగొమ్ము గ్రామ పంచాయతీలోని జగన్నాథపురం గ్రామంలో 2017లోనే సర్వే చేసి డాక్యుమెంటేషన్ చేసి, 2019లో గ్రామసభ పెట్టి 335 ఇళ్లకు అవార్డు పాస్ చేసి, యాజమానుల దగ్గర సంతకాలు తీసుకున్నారు. ఈనెల 24న ఎస్‌డిసి ఏలూరు వారు విడుదల చేసిన పిడిఎఫ్‌లో 140 ఇండ్లను తొలగించి నిర్వాసితులకు తీరని అన్యాయం చేశారన్నారు. సమస్యలు తెలుసుకున్న ఆర్ అండ్ ఆర్ కమిషనర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, ప్రతి ఒక్క నిర్వాసితుడికి న్యాయం జరిగే విధంగా సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు. కమిషనర్‌ని కలిసిన వారిలో ఎంఎల్‌ఎ వెంట జనసేన మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ, బిజెపి మండల అధ్యక్షులు ములకలపల్లి నరసింహారావు పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి మంత్రి సాయం

నూజివీడు టౌన్ : నూజివీడు మండలం పోతిరెడ్డి పల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు భార్యాభర్తలు మరణించిన ఘటనలో మృతుల కుటుంబ సభ్యులకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో 24 గంటల వ్యవధిలోనే విజయ డైరీ సంస్థ ద్వారా రూ.2.50 లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అండగా నిలబడటం పట్ల బాధిత కుటుంబ సభ్యులు మంత్రి పార్థ సారథికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఇటీవల పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొండా రామారావు, ప్రశాంతి దంపతులు తమ పశువులను నీటి కోసం శనివారం సమీప చెరువులోకి తీసుకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన సంగతి విధితమే.

యువకుడు అనుమానాస్పద మృతి

కుక్కునూరు : మండలంలోని సీతారామనగరంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మృతిపై పలు భిన్న కథనాలు వ్యక్తమవుతున్నాయి. ఎ.రామకృష్ణ వెల్లడించిన వివరాల ప్రకారం.. సీతారామనగరానికి చెందిన బొల్లి సంతోష్(25) వ్యవసాయం చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నట్లు తెలిపారు. ఈక్రమంలో మంగళవారం ఉదయం గ్రామం బయట ఉన్న ఓ పొలంలో సంతోష్ విగత జీవిగా పడి ఉన్నాడని పేర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకోగా మృతిని ఒంటిపై అక్కడక్కడా గాయాలు ఉన్నాయని, దీంతో సంతోష్ మృతిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు ఎస్ఐ అన్నారు. సంతోష్‌ను ఎవరైనా హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతిని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కుక్కునూరు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

జిల్లా పర్యవేక్షణాధికారి జె.దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో బాలల సంరక్షణ కేంద్రాలు నడుపుతున్న సంస్థలు, వ్యక్తులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా పర్యవేక్షణాధికారి జె.దుర్గాప్రసాద్, జిల్లా బాలల సంరక్షణ అధికారి, డాక్టర్ సిహెచ్.సూర్యచక్రవేణి సంయుక్త ప్రకటనలో తెలిపారు. జువెనైల్ జస్టిస్(పిల్లల ఆదరణ, సంరక్షణ) చట్టం 2015, నిబంధనలు 2016, సవరించబడిన నిబంధనలు 2022లోని నిబంధన 21 ప్రకారం, రక్షణ, సంరక్షణకు అవసరమైన పిల్లలకు, స్వచ్ఛందంగా నడపబడుతున్న బాలల సంరక్షణ కేంద్రాలన్నీ, ఇతర ఏదైనా చట్టం కింద లైసెన్సులు ఉన్నప్పటికీ, జువెనైల్ జస్టిస్(పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం 2017లోని సెక్షన్ 41 కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా వారు తెలిపారు. బాలల సంరక్షణ కేంద్రాలుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకున్న వారు నిర్దేశించబడిన ప్రొఫార్మాలో నింపబడిన దరఖాస్తులతోపాటు, అన్ని కాపీలను జతచేసిన దరఖాస్తును నవంబర్ 11వ తేదీ లోపు సంచాలకులు, బాలల సంక్షేం, సంస్కరణ సేవలు, వీధి బాలల సంక్షేమశాఖ, విజయవాడ కార్యాలయానికి పంపవలెనన్నారు. దీనికి సంబంధించిన పూర్తి నోటిఫికేషన్, చిరునామా, అర్హతలు, జతపరచవలసిన డాక్యుమెంట్లు, చెక్‌లిస్టు మొదలైన వాటిని %http://wdcw.ap.gov.in% అనే వెబ్‌సైట్ నుంచి పొందవచ్చును. దరఖాస్తులను స్పీడ్ పోస్ట్ లేదా రిజిస్టర్ పోస్ట్ ద్వారా మాత్రమే, సాఫ్ట్ కాపీలను మెయిల్ %cci.reg2024@gmail.com% రెండిటి ద్వారా ఖచ్చితంగా పంపాలి. తదుపరి సమాచారానికి జిల్లాకు సంబంధించి కన్వీనర్ జె.దుర్గాప్రసాద్, జిల్లా పర్యవేక్షణ అధికారి 9100045424, కో-కన్వీనర్ డాక్టర్ సిహెచ్.సూర్య చక్రవేణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి 7901597267 వారిని సంప్రదించవచ్చునని వారు పేర్కొన్నారు.

అట్లూరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన సాయం

ప్రజాశక్తి - ముసునూరు

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటానికి అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత అట్లూరి రవీంద్ర ముందు ఉంటారని నిరూపించుకున్నారు. గత ఆదివారం రాత్రి జరిగిన గోపవరం గ్రామంలో గ్యాస్ లీకై అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కోడె శ్రీనివాసరావు కుటుంబాన్ని అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత అట్లూరి రవీంద్ర పరామర్శించి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాసరావు, మాజీ సర్పంచి ధర్మరాజు, మాజీ ఎంపిటిసి శ్రీను, నాగార్జున పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక పట్ల హర్షం

ప్రజాశక్తి - చింతలపూడి

13 సంవత్సరాల తరువాత చింతలపూడి నియోజకవర్గం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపల్ హెచ్.శ్రీనివాస్ అన్నారు. చింతలపూడి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిఇసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని వి.భార్గవి అండర్-19 రాష్ట్రస్థాయి ఇంటర్ జిల్లా ఛాంపియన్ షిప్‌లో పాల్గొని సిల్వర్ మెడల్ గెలిచి, జార్ఖండ్(రాంచి)లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువుతున్న తమ విద్యార్థిని జాతీయ స్థాయిలో ఎంపికకావడం తమకు గర్వంగా ఉందన్నారు. హోంగార్డు ఉద్యోగం చేస్తూ విద్యార్థినులకు వివిధ క్రీడలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్న కోచ్ సూరిబాబుకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

జెడ్‌పిహెచ్ విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం చాలా ఆనందదాయకంగా ఉందని పాఠశాల ప్రిన్సిపల్ ఎ.సునీలా రెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు మున్సిపల్ హై స్కూల్ గుడివాడలో జరిగిన స్కూల్ గేమ్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన బాలికల విభాగం అండర్-14 ఖోఖో పోటీల్లో ముసునూరు హైస్కూల్ విద్యార్థి తోమ్మండ్రు ప్రసన్న కుమారి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో ఆ విద్యార్థిని హెచ్‌ఎం సునీలా రెడ్డి, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. క్రీడారంగంలో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఆ పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులైన హేమా దేవి, అలీ ఖాన్‌లను ప్రత్యేకంగా ఉపాధ్యాయులు ఫ్రాన్సిస్, శివ నాగమణి, రాంబాబు, రత్నమాల అభినందించారు.

సాగు ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతులు సాగు ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచాలని చింతలపూడి వ్యవసాయ సంచాలకులు బి.నాగకుమార్ సూచించారు. మంగళవారం టి.నరసాపురం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పొలాలను పరిశీలించిన ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. రైతులు రసాయన పురుగు మందుల వినియోగానికి బదులుగా ప్రకృతిలో లభించే తూటి కాండ కషాయాన్ని తయారు చేసి, పిచికారీ చేయడం ద్వారా దోమ పోటును నివారించొచ్చన్నారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సుమలత మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. ప్రతి పంటను ఇ-పంటలో నమోదు చేయించుకోవాలని, కౌలు రైతు కార్డులు తీసుకోవాలని, భూసార పరీక్ష ఫలితాలు, మట్టి సేకరణ, ధాన్యం కొనుగోలు కేంద్రం వంటి సౌకర్యాలు వివరించారు. పొగాకు బదులు మొక్కజొన్న సాగు చేపట్టాలని సూచించారు. పశుసంవర్ధక శాఖాధికారి కె.కోటేశ్వరరావు, సర్పంచి ఎం.సునంద, ఎంపిటిసి ఎన్.వెంకటరావు, కొల్లి రమేష్, కొండపల్లి రవి, కొరివి శ్రీకాంత్, పండూరి పోతురాజు, రైతు సేవా కేంద్రం సిబ్బంది కె.నరేంద్ర పాల్గొన్నారు

జీలుగుమిల్లి : రైతులు పండించే పంటలలో క్రిమి సంహారక ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయాధికారి కె.గంగాధర్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని దర్భగూడెం రైతు సేవాకేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని పలు రకాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించే పంటలలో క్రిమి సంహారక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడటం వల్ల అధిక దిగుబడులు వస్తాయని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు కనకదుర్గ, రాములమ్మ, రైతులు జానకి రామిరెడ్డి, సాంబ, బలరాం, చిరంజీవి, వెంకట్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని, అదే సందర్భంలో నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు అన్నారు. సిపిఎం మండల కమిటీ సమావేశం పి.బోసు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో నవంబర్ 8 నుంచి 15వ తేదీ వరకు 'ప్రజా పోరు' పేరుతో మండలంలోని అన్ని గ్రామాలను పర్యటించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, 15న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు సిహెచ్.శ్రీమన్నారాయణ, మండల కమిటీ సభ్యులు ఎం.లక్ష్మయ్య, ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

రసవత్తరంగా ఖోఖో పోటీలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14, 16 బాల, బాలికల ఖోఖో ఎంపికలు మంగళవారం నిర్వహించబడ్డాయి. ఈ ఖోఖో బాలబాలికల ఎంపికలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 700 మంది క్రీడాకారులు, 100 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారని ఆర్గనైజింగ్ అధ్యక్షులు, ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాద్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.నాగ సుధా తెలియజేశారు. ఈ జిల్లాస్థాయి ఖోఖో ఎంపికల నిమిత్తం ఏర్పాటు చేసిన మూడు కోర్టులలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉంగుటూరు మండల జెడ్‌పిటిసి కొరిపల్లి జయలక్ష్మి, ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఛైర్మన్ అల్లూరి జగదీశ్వరి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సలగాల గోపి, ఎస్‌ఎంసి వైస్ ఛైర్మన్ ఎస్.బలరాం, ఎస్‌ఎంసి కో ఆప్టెడ్ సభ్యులు బండారు నాగేశ్వరరావు, జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.అలివేలు మంగమ్మ, ఉంగుటూరు నియోజక వర్గ స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ ఎమ్‌బిఎల్.నారాయణ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు రమేష్ పాల్గొన్నారు. ఈ జిల్లాస్థాయి ఖోఖో ఎంపికలలో అండర్-14, బాలురు, బాలికలు అండర్-16 బాలురు, బాలికలు నాలుగు కేటగిరీల్లో ఒక్కొక్క కేటగిరీ నుంచి 16 మంది చొప్పున మొత్తం 64 మందిని రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేశామని, అండర్-14 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు పల్నాడు జిల్లాలో, అండర్-16 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు అనకాపల్లిలో జరుగుతాయని చెప్పారు.

వసతిగృహ విద్యార్థులకు సౌకర్యాల కల్పనకు కృషి

ప్రజాశక్తి - మండవల్లి

బిసి బాలుర వసతిగృహంలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు అంచనాలు రూపొందించామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఆర్‌వి.నాగరాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండవల్లి బిసి బాలుర వసతి గృహాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించడం జరిగిందని అన్నారు. వసతిగృహం మరమ్మతులకు నోచుకుందని గమనించడం జరిగిందన్నారు. వసతి గృహాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించేలా రూ.6.90 లక్షలతో ఆర్అండ్‌బి ఎఇతో అంచనాలు రూపొందించామని తెలిపారు. రూపొందించిన అంచనాలను ప్రభుత్వానికి పంపడం కూడా జరిగిందని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు ప్రారంభించి, పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

తల్లీబిడ్డ మృతి: బంధువుల ఆందోళన

చింతలపూడి : ప్రసవం కోసం ప్రయివేట్ హాస్పిటల్‌లో చేరగా తొలుత పసికందు, తరువాత బాలింత మృతిచెందిన ఘటన చింతలపూడిలో కలకలం సృష్టించింది. దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని స్థానిక సాయి స్ఫూర్తి హాస్పటల్‌లో వెంకటాపురం గ్రామానికి చెందిన కోడూరి పరిమళ 27వ తేదీన డెలివరీ కోసం చేరారు. ఆదివారం డెలివరీ చేశారని, నర్సులు డెలివరీ చేయటంతో అధిక రక్తస్రావం జరిగి, పసిబిడ్డ చనిపోయాడని, మంగళవారం నాడు తల్లి కూడా చనిపోయిందని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. డెలివరీ చేసిన నర్సులను వెంటనే సస్పెండ్ చేయాలని, ఆ సమయంలో విధుల్లో ఉన్న వారందరినీ సస్పెండ్ చేయాలని, వైద్యురాలిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.


ఆసుపత్రి వద్ద రోధిస్తున్న బంధువులు

మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి ధర్నా నిర్వహించారు. దీనిపై డిఎంహెచ్ఒని వివరణ అడగగా నిబంధనల ప్రకారం డెలివరీ జరగలేదని, షోకజ్ నోటీసు అందజేస్తామని తెలిపారు. అనంతరం చర్యలు తీసుకుంటామని అన్నారు.

నాన్ టీచింగ్ సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది వి.రవి, రికార్డ్ అసిస్టెంట్ పి.మరియమ్మ, ల్యాబ్ అసిస్టెంట్, అటెండర్ బాలమ్మ మంగళవారం బదిలీపై వెళ్లారు. వారికి సన్మాన కార్యాక్రమాన్ని పాఠశాలలో ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాధికా రాణి మాట్లాడుతూ విద్యార్థులకు స్టడీ సర్టిఫికెట్లు, టిసిలు, అంటెండెన్స్‌లు, ఆఫీసు పని నిర్వహించేవారన్నారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, జల్లులక్ష్మి, మల్లేశ్వరి, కృష్ణవేణి, విఠల్ బాబు, సాకారవి పాల్గొన్నారు.

నాగుల చవితి ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - ముదినేపల్లి


ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఆలయ ఇఒ

మండలంలోని సింగరాయపాలెం-చేవూరు సెంటర్‌లో వేంచేసియున్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో నాగులచవితికి ఏర్పాట్లు చేస్తున్నామని, విజయవంతమయ్యేలా ఇరు గ్రామాల గ్రామపెద్దల సమన్వయంతో పనిచేయాలని ఆలయ ఇఒ ఆర్.గంగాశ్రీదేవి విజ్ఞప్తి చేశారు. మంగళవారం దేవస్థానం కార్యాలయంలో ఇరు గ్రామాల పెద్దలతో నాగులచవితి ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వచ్చేనెల నవంబర్ 5న జరగబోయే నాగులచవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సింగరాయపాలెం, చేవూరుపాలెం గ్రామాలకు చెందిన గ్రామపెద్దలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

టపాసుల స్వాధీనం

కలిదిండి : మండలంలోని కోరుకొల్లులో ఎటువంటి అనుమతులూ లేకుండా అక్రమంగా దీపావళి మందుగొండి సామగ్రి తయారు చేస్తున్న చన్నంశెట్టి వెంకట సత్యన్నారాయణ, చలమలశెట్టి సతీష్ నుంచి టపాసులు స్వాధీనపరచుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. అనుమతులు లేకుండా ఫైర్ క్రాకర్స్ తయారు చేసినా, నిల్వ ఉంచినా, కఠినచర్యలు తప్పవని ఎస్ఐ అన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు

కలిదిండి : ఎవరైనా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. మట్టగుంటలో అక్రమంగా మద్యం సీసాలు అమ్ముతున్న కటికితల జాన్‌పై కేసు నమోదు చేశారు.

టపాసుల షాపు ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు

దీపావళి పండుగ పురస్కరించుకుని అందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని టిడిపి మండల అధ్యక్షులు దేవినేని డైలారం అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో దీపావళి టపాసుల షాపును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు పాకనాటి సీతా రామాంజనేయులు, హేమ, పవన్ స్వామి, తలకొండ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జెడ్‌పిహెచ్ విద్యార్థిని ఎంపిక

మండవల్లి : రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు లోకుముడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎండవల్లి సంజన ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులగం వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మంగళవారం మాట్లాడారు. ఈనెల 28న గుడివాడ ఎస్‌పిఎస్ పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి ఖోఖో బాలికల అండర్-14 విభాగంలో సంజన ఖోఖో ఆటలో అత్యుత్తమమైన నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. నవంబర్‌లో గుంటూరు జిల్లా కారంపూడిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ఆడుతుందని అన్నారు. రాష్ట్రస్థాయి ఖోఖో ఆటలో రాణించి పాఠశాలకు, గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన కోరారు. వ్యాయామ ఉపాధ్యాయులు వేణు బాబును అభినందించారు.

నోటీసు

మహారాజశ్రీ సివిల్ జడ్జి వారి కోర్టు (సీనియర్ డివిజన్) : నర్సాపురం

FDP05/2023 in O.S.No.158/2018

Between:
వీరా సత్యవతి ...పిటీషనర్/వాది
Vs
ఓడూరి నాగేశ్వరరావు ...రెస్పాండెంట్స్/ప్రతివాది

To.
ఓడూరి నాగేశ్వరరావు, తండ్రి సూర్యారావు,
ఓడూరి వారి వీధి, మేడపాడు,
యలమంచిలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు గల పిటిషనులో రెస్పాండెంట్ అయిన మీకు శ్రీకోర్టు వారు అనేక పర్యాయములు నోటీసులు పంపించినప్పటికి తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున, శ్రీకోర్టు వారు ఆదేశముల మేరకు మీ హాజరు కొరకు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసులు జారీ చేసియున్నారు. వాయిదా తేది **ది.07-11-2024** తేదీన ఉదయము 10.30 ని॥ గంటలకు మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై మీకు అభ్యంతరములు ఉన్నయెడల తెలియజేసుకొన గలరు. లేనియెడల సదరు విషయముపై మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

శ్రీకోర్టు వారి ఆదేశాలు మేరకు,
పాలకొల్లు **ఎస్.కె.రామలింగేశ్వరరావు**
తేది. 29.10.2024 **ఐ.శివసాంబమూర్తి**
అడ్వకేట్స్, పాలకొల్లు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 187/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నరసాపురం బ్రాంచ్, దాని చీఫ్ మేనేజర్
-వాది

మరియు

D-1) యండపల్లి రమేష్ మరియు యితరులు
-ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: యండపల్లి రమేష్, S/o. వెంకటేశ్వరరావు, 7వ వార్డు, రాయివారివీధి, ఆంధ్రబ్యాంకు రోడ్డు, నరసాపురం, ప॥గో॥జిల్లా, 534275.

D-2: యండపల్లి శ్రీదేవి, W/o. రమేష్, 7వ వార్డు, రాయివారివీధి, ఆంధ్రబ్యాంకు రోడ్డు, నరసాపురం, ప॥గో॥జిల్లా, 534275.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగంతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 01-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 335/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్
-వాది

మరియు

D-1) కాసాని సీతారామయ్య, S/o. పెదముసలయ్య
-ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: కాసాని సీతారామయ్య, S/o. పెదముసలయ్య, డోర్ నెం. 25-14-44/7, శంబునిపేట, పాలకొల్లు, ప॥గో॥జిల్లా, 534260.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగంతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 01-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514